
కథ

# నేనూ-నా లవ్ స్టోరీ

- మల్లిక్ -



*నాకు చాలా దఃఖంగా ఉంటుంది... చాలా డిప్రెస్డ్‌గా కూడా ఉంటుంది... హ్హరె! ఎందుకనీ అనుకుంటున్నారా?... ఆ పాయింట్‌కే వస్తున్నా!*

*నా క్లోజ్ ఫ్రండ్ సుబ్బారావనీ ఒహడున్నాడు. వాడచ్చం కోతిలా ఉంటాడు. అయినా వాడికి అందమైన గర్ల్ ఫ్రండ్ ఉంది. వాడికే కాదు... నా ఫ్రండ్స్ అందరికీ గర్ల్ ఫ్రండ్స్ ఉన్నారు. ఒక్క నాకు తప్ప. అసలు ఒక్కోక్కప్పుడు నాకనిపిస్తుంటుంది... ఈ ప్రపంచంలో మగాడన్న ప్రతి ఒక్కడికీ ఏదో ఓ లెవెల్లో గర్ల్ ఫ్రండ్ ఉందేమో!*

నేను అందగాడిని కాకపోయినా అసయ్యంగా మాత్రం ఉండను మరి నాకు ఒక్క గర్ల్‌ఫ్రండ్ కూడా ఎందుకు లేదు?

ఎందుకు లేదు?... ఎందుకు లేదు?... అనుకుంటూ జుట్టు పీక్కునీ పీక్కునీ వత్తయిన నా క్రాపు కాస్త పల్చబడిందికూడా. అదండీ... నా బాధ, డిప్రెషన్‌కీ కారణం.

కానీ నా బాధ, డిప్రెషన్ తీరిపోయే రోజు మరీ ఇంత త్వరగా వస్తుందని నేననుకోలేదు.

ఆ రోజు...

నేను బస్సుస్టాండ్‌లో బస్సుకోసం ఎదురు చూస్తూ నిల్చున్నా. ఇంతలో గలగలా శబ్దం! పక్కకి తిరిగి చూశా. ఆ అమ్మాయి నావైపు చూసి నవ్వుతూంది.

అనుమానం వచ్చి నా వెనకాల ఎవరైనా ఉన్నారేమోనని వెనక్కి తిరిగి చూశా... ఎవరూ లేరు! ఆ అమ్మాయి నావైపే చూసి నవ్వుతోంది.

ఈ ప్రపంచంలో నన్నుకూడా చూసి నవ్వే ఆడదుందంటే నాకు లల్లూ ప్రసాద్ యాదవ్ కంటే ఎక్కువ గడ్డి తిన్నంత ఆనందంగా ఉంది. హైదరాబాద్‌లో సగం భూముల్ని కబ్జా చేసినంత సంబరంగా ఉంది.

అవకాశాన్ని చేజార్చుకోకూడదని నేనుకూడా ఆ అమ్మాయిని చూసి నవ్వాను. ఆ అమ్మాయి ఇంకా ఎక్కువ నవ్వింది.

లాభం లేదు... ఆ అమ్మాయిని పరిచయం చేస్కోవాల్సిందే!

నేను మెల్లగా ఆ అమ్మాయ్ దగ్గరికి వెళ్లాను.

"నా పేరు వెంకట్రావ్. మీరు నన్ను వెంకట్ అనో వెంకీ అనో పిలవొచ్చు..." అన్నాను ఆమెతో మెల్లిగా.

"నా పేరు సునీత!" చెప్పింది ఆ అమ్మాయి.

"నన్ను చూసి నవ్వారు! యేం!... నేను మీకు అంతగా నచ్చానా?.." అడిగాను.

"నేను నవ్వింది అందుక్కాదు... మీరు మీ ప్యాంట్ జిప్పేస్కోడం మర్చిపోయారు...." కిసుక్కున నవ్వి ఎటో చూసింది సునీత.

నాకాళ్లకింద భూమి కదిలింది... నా బుర్ర గిర్రున తిరిగిపోయింది. నేను కంగారుగా వెనక్కి తిరిగి ప్యాంట్ జిప్పుని సర్రున పైకి లాక్కున్నా.

ఛీ! ఏ పనీ సరిగా చెయ్యనుకదా!

నన్ను నేను తిట్టుకున్నా.... నా వెనకాల ఆ అమ్మాయి నవ్వింది.

వెనక్కి తిరిగి "సారీ సునీతగారూ...మీరు నవ్వితే నేనంటే ఫ్రండ్లీగా ఫీలయ్యి నవ్వారను కున్నా..." అన్నాను.

"నేను నవ్వింది వేరే విషయానికే అయినా మీరు నాకు నచ్చారన్నది నిజం.."

నేను నమ్మలేనట్టుగా ఆమెవంక చూశాను.

"నిజం వెంకట్‌గారు ...మీరు ఆఫీసుకు రోజూ మా యింటిముందునుండే వెళ్తుంటారు... మీ మొహంలోని అమాయకత్వం నాకెంతో నచ్చింది... నాకు మీతో స్నేహం చెయ్యాలని ఉంది... మీ కభ్యంతరం లేకపోతే..." నా కళ్లలోకి చూస్తూ అంది.

"యాహూ..." సంతోషంతో గట్టిగా అరిచాను నేను. నా అరుపుకి చెట్టుమీది కాకి గుండాగి ఠపామని చచ్చి నేలమీదికి రాలిపోయింది.

000

వారం తరువాత...

సునీతా నేనూ ఇందిరా పార్క్‌కి వెళ్లాం. ఇద్దరం పార్కులో కాస్సేపు కూర్చుని మాట్లాడుకున్నాం.

"మా నాన్నకి నేనంటే చాలా యిష్టం. నాకైతే మా నాన్నంటే ప్రాణం. ఆయన్ని చిన్నమాట ఎవరైనా అంటే వాళ్లు నాకు బద్ధ శత్రువులైపోతారు... మా నాన్నా అంతే... నేనేం కోరినా కాదన్రు!" మాటలసందర్భంలో చెప్పింది సునీత.

ఆ రోజు రాత్రి బెడ్‌మీద పడుకున్న నాకు సునీత అన్న ఆ వాక్యమే పదేపదే గుర్తొచ్చింది.

"...మా నాన్నా అంతే... నేనేం కోరినా కాదన్రు!"

అంటే... తను "నాన్నా... నేను వెంకట్‌ని ప్రేమించా... ఆయన్నే పెళ్లి చేస్కుంటా" అని సునీత అంటే వాళ్లనాన్న కాదనడా?..

సునీత చెప్పిన దాన్నిబట్టి కాదనడనే అర్థం.

"యాహూ..." సంతోషంతో గట్టిగా అరిచా.

అసలు నేనింతగా ఆలోచిస్తున్నాగానీ సునీత అభిప్రాయం ఏంటో మరి?

ఇలా ఆలోచిస్తూ ఆ రాత్రికి నిద్రపోయా.

రెండ్రోజుల తరువాత నేనూ, సునీతా ఓ రెస్టారెంట్‌కి వెళ్లాం. ఇద్దరం ఓ మూలనున్న టేబుల్ దగ్గర కూర్చున్నాం.

"నీకేం కావాలి?".. అడిగాను సునీతని.

సునీతతో పార్క్‌కీ, రెస్టారెంట్‌కీ తిరిగే సరికి నాకు ఆమెని నువ్వు అనే చనువు వచ్చేసింది. సునీతకీ నాదగ్గర చనువొచ్చేసింది.

"నాకు అది కావాలి!..." పక్క టేబుల్ దగ్గర కూర్చున్నతని ముందున్న ప్లేటుని చూపిస్తూ అంది సునీత.

నాకు చాలా ఇబ్బందిగా అనిపించింది.

"నాకు నీ కోరిక తీర్చాలనే ఉందిగానీ.... అది అతను ఆర్డరిచ్చి తెప్పించుకున్నాడు. దాన్ని ఇచ్చెయ్య మంటే బాగుండదు!.." బాధగా అన్నాను.

సునీత గలగలా నవ్వింది.

"నీ అమాయకత్వం నాకు నచ్చిందని అన్నానుకదాని నువ్వు మరీ ఇంత అమాయకంగా మాట్లాడక్కర్లా... అతను తింటున్న ప్లేటు కావాలని అనడానికి నేనేమైనా తిక్కల్దాన్నా?... అది ఆర్డర్ చెయ్యమంటున్నా..."

మళ్లీ గలగలా నవ్వింది.

సునీత అలా నవ్వుతుంటే నాకు చెడ్డ ముద్దొచ్చేసింది. లాభంలేదు... ఇప్పుడు సునీతతో "అయ్ లవ్ యూ..." అని చెప్పెయ్యాల్సిందే!... నేను గొంతు సవరించుకున్నా.

"సునీతా... అయ్ లవ్... చికెన్...."

ఫ్రాక్షన్ ఆఫ్ సెకెండ్‌లో డెసిషన్ మార్చుకుని చికెన్ అనేశా.

"ఆ విషయాన్ని అంత గంభీరంగా చెప్పాలా? అయ్ టూ లవ్ చికెన్! చికెన్ సిక్స్‌టీఫైవ్ కూడా ఆర్డర్ చెయ్... కానీ ఒక్క విషయం! బిల్ నేనే పే చేస్తా..." అంది సునీత.

ఆ రోజు రాత్రి నిద్రపోయేముందు నేను చాలా ఆలోచించా. సునీతతో నేను "అయ్ లవ్ యూ..." అని చెప్పెయ్యడమే... అప్పుడు సునీత కూడా అయ్ టూ లవ్ యూ అని అంటుంది. అప్పుడిహ ఇద్దరికీ "ఢూం" అంటూ పెళ్లి..

"యాహూ... " అనుకోకుండా గట్టిగా అరిచా.

"ఈ తిక్కవెధవ ఈ మధ్య అర్ధరాత్రి పూటల ఇలా దిక్కుమాలిన అరుపులు ఎందుకరుస్తున్నాడటా?" అంటూ నాన్న తనని గదిలోంచి తిడ్తూ అమ్మని గట్టిగా అడగడం నాకు వినిపించింది.

నేను నాలుక్కర్చుకుని మొహం మీద నిండుగా దుప్పటి కప్పుకుని నిద్దరోయా.

ఆ తరువాత మేమిద్దరం పదిరోజుల్లో మూడు సార్లు పార్కులో కల్సుకున్నాం. కానీ నేను సునీతకి అయ్ లవ్‌యూ అని చెప్పలేకపోయా. నా పిరికితనానికి నామీద నాకే కోపం వచ్చింది. సునీతతో నేను వెంటనే నా ప్రేమ విషయం తెలియజెయ్యకపోతే వేరే ఏ గన్నాయ్‌గాడో నాకంటే ముందు సునీతతో "అయ్ లవ్ యూ..." అనేసి ఆమెని గ్రద్దలా తన్నుకుపోతాడు.

నో అలా జరగడానికి వీల్లేదు. సునీతకి ముందుగా నేనే నా ప్రేమని తెలియజెయ్యాలి.

వెంటనే హాస్టల్‌కి ఫోన్ చేసి మర్నాడు సాయంత్రం ఇందిరా పార్క్‌కి రమ్మని చెప్పాను తను సరే నంది. ఆ రాత్రి నాకు సరిగా నిద్ర పట్టలేదు. మర్నాడు సాయంత్రం...


పార్కులోకి అల్లంత దూరంనుండి వస్తున్న సునీతని చూసి నేను ఆనందంగా ఆమె దగ్గరికి పరుగుతీశా.

"రా... ఆ మూల కూర్చుందాం..." అన్నాను.

"అబ్బ!... ఇప్పుడు నేను పార్కులో కూర్చోడానికి రాలేదు... పద బయటికెళదాం..." చేతి వాచ్ వంక చూస్తూ హడావిడిగా అంది సునీత.

"ఎక్కడికి?..." అడిగాను.

"సన్నాసి మొగుడూ.. సంసారి భార్యా సిని మాకి!"



"టైటిల్ చూస్తే అలా ఉంది... ఆ సినిమా అంత బాగుండదేమో?" నసిగాను నేను.

"బాగున్నా బాగోపోయినా వెళ్ళాల్సిందే! అది నా అభిమాన హీరో నటించిన సినిమా..." అంటూ ఆ వైపుగా వెళ్తున్న ఆటోని ఆపింది. ఇద్దరం ఆటో ఎక్కాం.

సినిమా హాల్లో అయ్ లవ్‌యూ అని చెప్దా మంటే సునీత నన్నసలు మాట్లాడనివ్వలేదు.

"అబ్బ!.. మాట్లాడకుండా సినిమా చూడు వెంకట్.. మంచిమంచి డైలాగులు మిస్సయిపో తాం..." అంది సునీత.

ఆ మాట ఆమె నాతో అంటున్నప్పుడు స్క్రీన్ మీద హీరో హీరోయిన్‌తో "నా లస్కు లకోరీ... డుస్కు ఢమాకీ శోభనం చేస్కుందాం రా..." అంటూ డైలాగ్ కొడ్తున్నాడు.

ఎలాగోలా సినిమా హాల్లో రెండున్నర గంటలు గడిపేశా...

హాల్లోంచి బయటికొచ్చాక మళ్ళీ నా పాతపాట పాడా... "సునీ.. ఏదైనా రెస్టారెంట్‌లో ఓ అరగంట పాటు కూర్చుందాం.."

"ఇప్పుడు రెస్టారెంటా?.. మంచి వాడివే... మా హాస్టల్‌వార్డెన్ వాత పెడ్తుంది!..." అంటూ ఆటో ఎక్కేసి "రాత్రి కదా... హాస్టల్ దగ్గర నన్ను దింపి వెళ్ళు" అంది.

నేను నోర్మూసుకుని ఆటో ఎక్కి సునీత ప్రక్కన కూర్చున్నా. పది నిముషాల్లో ఆటో హాస్టల్ ముందు ఆగింది.

ఇద్దరం ఆటో దిగి హాస్టల్ గేటుని సమీపిం చాం.

"బాప్‌రే... గేట్లు మూసేశారు!" గుండెలమీద చెయ్యేస్కుంటూ అంది సునీత. ఆమె మొహంలో టెన్షన్.

"ఇప్పుడెలా?.." అడిగాను నేను.

"మా హాస్టల్ వార్డెన్ చాలా చండశాసనురాలు... ఇప్పుడు లోపలికి రానివ్వదు... అంతేకాదు... రాత్రి పదిగంటలకి రూమ్‌లన్నీ చెక్ చేసి గదిలో లేని వాళ్ళ పేర్లు నోట్ చేస్కుని వాళ్ళమీద సీరియస్ యాక్షన్ తీస్కుంటుంది. అది రూమ్స్‌కి చెకింగ్‌కి వెళ్ళేలోగా నేను దానికి తెలీకుండా హాస్టల్ లోపలికి ఎలాగైనా వెళ్ళాలి!..." భయంభయంగా అంది సునీత.

నేను బుర్రగోక్కున్నా!...

కాస్సేపు తర్జన భర్జనలయ్యాక నాకో బ్రిలి యంట్ అయిడియా వచ్చింది. క్రిందికి వంగి పెద్ద రాయి తీశా.

"ఏం చేస్తున్నావ్?.." కుతూహలంగా అడిగింది సునీత.

"నువ్వే చూస్తావ్‌గా! ..." అని ఆ రాయిని గోడమీదనుండి బలంగా హాస్టల్‌లోకి విసిరా.

"ఠంగ్... కళుంగ్.. కాళుంగ్.." అంటూ లోపల పడ్డరాయి శబ్దం చేసింది. ఇద్దరం అక్కడే ఉన్న చెట్టు వెనికాలకి నక్కాం.

హాస్టల్ గేటు తెరుచుకుంది. గూర్ఖా బయటికి వచ్చాడు. అటూ ఇటూ తొంగి చూస్తూ.. "కౌన్ హై బే...?" అంటూ కోపంగా అరిచి కొన్ని క్షణాలు వెయిట్ చేసి మళ్ళీ గేట్లు మూసేశాడు.

"ఏం లాభం.. జరిగిందిప్పుడు?" అడిగింది సునీత.

"చూస్తూండు... " అంటూ క్రిందికి వంగి.. ఈసారి మరింత పెద్దరాయి తీసి లోపలికి విసిరా. వెంటనే ఇద్దరం చెట్టువెనక్కి నక్కాం.

రాయి హాస్టల్‌లో పడగానే లోపలినుండి గావుకే కలు వినబడ్డాయ్. క్షణాల్లో హాస్టల్‌గేట్లు తెరుచుకుని గుర్ఖా "కౌన్ హై బద్మాష్.... మార్‌డాలూంగా?..." అంటూ కోపంగా అరుచుకుంటూ బయటికి వచ్చి అటూ ఇటూ చూసి, తిట్టుకుంటూ కాంపౌండ్‌వాల్ వెంబడి నడుచుకుంటూ హాస్టల్ వెనక్కి వెళ్ళాడు ఎవరైనా కనిపిస్తారేమోనని.

నేను సునీతవైపు గర్వంగా చూసి "ఇహ లోప లికి పరిగెత్తు..." అన్నాను.

సునీత తీసి ఉన్న గేట్లోంచి హాస్టల్‌లోకి పరుగు తీసింది.

లోపలినుండి ఇంకా ఎవరో వ్యక్తి అరుపులు వినిపిస్తూనే ఉన్నాయ్. కాంపౌండ్‌వాల్ చుట్టు రౌండ్ కొట్టి గుర్ఖా మళ్ళీ లోపలికి వెళ్లి గేట్లు మూసేశాడు.

నేను యింటిదారి పట్టా.

అంతే... సునీతతో అదే నా ఆఖరి కలయిక అని అప్పుడు నాకు తెలీదు.

మర్నాడు సునీత కోసం ఫోన్ చేశాను . నా గొంతు వినగానే సునీత ఫోన్ పెట్టేసింది. మరో సారి చేశాను.

"నాతో మాట్లాడ్డానికి ప్రయత్నించకు... అయ్ హేట్ యూ... నువ్వు అమాయకుడివనుకున్నాగానీ బుర్రలేనివాడివని అనుకోలేదు..." అంటూ ఫోన్ పెట్టేసింది.

సునీత ప్రవర్తన నాకు అర్థం కాక బుర్ర బద్ద లుకొట్టుకున్నా. హఠాత్తుగా సునీతకి నా మీద ఎందుకు కోపం వచ్చింది?...

నాకేం అర్థం కాలేదు. వారంపాటు సునీతని కలవాలనీ, మాట్లాడాలనీ ప్రయత్నించానుగానీ కుదర్లేదు.

చివరికి ఒకరోజు సునీతని ఫోన్ డిస్కనెక్ట్ చెయ్యొద్దనీ. .. నా మీద అంతగా ద్వేషం కలగడా నికి కారణం చెప్పమని వేడుకున్నా.

సునీత నన్ను తిట్టిన తిట్టు తిట్టకుండా తిడ్తూ, తన కోపానికి కారణం చెప్పి ఇకముందు తనకి ఫోన్ చెయ్యొద్దని హెచ్చరించి ఫోన్ డిస్కనెక్ట్ చేసేసింది.

సునీతతో నా స్నేహం పర్మనెంట్‌గా కట్ అయిపోయిందని అప్పుడు నాకు తెలిసింది. ఇంతకీ సునీత కోపానికి కారణం ఏంటంటే...

ఆరోజు మేము సినిమాకి వెళ్ళినరోజు సునీత కోసం, ఆమె అమితంగా ప్రేమించే తండ్రి హాస్ట ల్‌కి వచ్చాడు. సునీత రాకకోసం ఆయన హాస్టల్ వరండాలో బెంచిమీద కూర్చుని ఎదురు చూస్తు న్నాడు. నేను హాస్టల్‌లోకి రెండోసారి విసిరిన రాయి ఆయన బుర్ర బద్దలు కొట్టింది. కొద్దిలో ఆయన కన్ను లొట్టబోవాల్సిందట!...

ఆ విధంగా నా లవ్ స్టోరీ ఫెయిలయిపో యింది.

ప్చ్!.. ఏంటో అందరికీ లవ్‌స్టోరీ ఉంటుంది... నాకు తప్ప!

■

